క్లుప్తంగా

చురుగ్గా గ్రావెల్ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణం చేయిస్తున్న సర్పంచ్ పట్టాభి

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డవలస గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. సర్పంచ్ బుడుమూరు పట్టాభి పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ నిధులతో 150 మీటర్ల మేర ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు పనులు చకచకా జరుగుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా సీసీ కాలువల నిర్మాణం



సీసీ కాలువల నిర్మాణం పరిశీలిస్తున్న సర్పంచ్ ఉమాపాపినాయుడు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఉన్న దళితవాడలో సీసీ కాలువల నిర్మాణం శరవేగంగా చేపడుతున్నారు. సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు పర్యవేక్షణలో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రధాన కాలువలకు అనుసంధాన కాలువల నిర్మాణం చేపడుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రాజాం: పట్టణంతో పాటు మండలంలోని బొద్దాం గ్రామంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సోమవారం జరిగే వేడుకల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎం.రామినాయుడు, రామకృష్ణ, సత్యనారాయణ, పారంనాయుడు, సురేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రాజాం సిటీ: స్థానిక సన్ స్కూల్‌లో ఇటీవల లలిత సమైక్య సేవా వైభవ ప్రపూర్ణ బిరుదు పొందిన మక్క అప్పలనాయుడు, పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శాసపు సత్యనారాయణను మానవతా సంస్థ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సమాజ శ్రేయస్సు కోరే మంచి వ్యక్తులు మన ప్రాంతంలో ఉండడం అభినందనీయమని, రానున్న రోజుల్లోనూ మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు నడవాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వాండ్రంగి గౌరీకుమార్‌ను పూర్వ విద్యార్థులు ఆదివారం సన్మానించారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన 2002–03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలిసి ఆయనకు జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలు అందజేసి, సత్కరించారు.

28న 'విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక'

బొబ్బిలి రూరల్: స్థానిక కోటిచెరువు వద్ద ఉన్న సబ్‌స్టేషన్ వద్ద ఈ నెల 28వ తేదీన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. బొబ్బిలి రూరల్ పరిధిలోని తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలకు చెందిన వినియోగదారులు ఎవరైనా తమ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమానికి హాజరుకావచ్చన్నారు. ఇదే కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ తదితరులు హాజరవుతారన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

రామభద్రపురం: మండల కేంద్రంలోని దిగువ హరిజన వీధికి చెందిన ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఇటీవల రామభద్రపురంలోని తన కన్నవారింటికి వచ్చిన ఆమె.. బొబ్బిలి మండలంలోని ముత్తాయివలస గ్రామంలోని తన అత్తవారింటికి వెళ్తానని చెప్పి, ఈ నెల 19వ తేదీన బయలుదేరింది. ఇప్పటివరకు ముత్తాయివలస చేరకపోవడంతో అటు కన్నవారు ఇటు అత్తవారు తమ బంధువుల గ్రామాల్లో వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో తల్లి సోమాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



రక్షణ కల్పించడం తప్పనిసరి

వైద్యులు, సిబ్బందిపై ఎప్పుడూ ఎలాంటి దాడులు జరగకుండా రక్షణ కల్పించడం తప్పనిసరి. ప్రతీ ఆస్పత్రిలో సెక్యూరిటీని నియమించాలి. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులపై దాడులు బాధాకరం. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్‌లో దాడులు జరగకుండా నివారించగలం. ముఖ్యంగా ఆస్పత్రులు, వైద్య కళాశాలల వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి.

–ఒమ్మి సోహినీరాఘవ్, వైద్యాధికారిణి, రేగిడి పీహెచ్‌సీ



ప్రత్యేక చట్టాలు అమలుచేయాలి

ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బంది, వైద్యులపై ఎటువంటి దాడులు జరగకుండా రక్షణగా ప్రత్యేక చట్టాలు రూపొందించి, అమలుచేయాలి. ఒకసారి జరిగిన దుర్ఘటనలోని నిందితులను కఠినంగా శిక్షిస్తేనే మరోసారి అలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉంటుంది. పని ప్రదేశంలో గానీ మరెక్కడైనా గానీ మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

–సౌమ్య, వైద్యాధికారిణి, సంతకవిటి పీహెచ్‌సీ



చెత్తాచెదారం.. దుర్వాసన..!



భాష్యం స్కూల్ రోడ్డులో ఇదే మురుగునీరు నుంచి దుర్గంధం వెదజల్లుతోంది..

రాజాం: పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న అపారిశుధ్యంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగునీటి నిల్వల కారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. ఎవరైనా అటు వైపుగా వెళ్లాలంటే ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోంది. ప్రధాన కాలువలకు మురుగు కాలువలను అనుసంధానం చేయకపోవడం, లోతట్టు ప్రాంతాలు, గుంతల్లో మురుగునీరు కొన్ని నెలలుగా ఉండిపోవడంతో నిత్యం దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. పలువురు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా రోగాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ వెనుక రోడ్డులో పేరుకుపోయిన మురుగు



కాంప్లెక్స్ వెనుక కాలనీలో చెత్తకుప్పలు



అధ్వానంగా నారాయణ స్కూల్ రోడ్డు

• చినుకు పడితే చిత్తడే



చిత్రంలో కనిపిస్తోంది.. రామభద్రపురం మండలం, కొండకెంగువ పంచాయతీ పరిధిలోని మధుర గ్రామమైన జీలికవలసకు వెళ్లే రోడ్డు. మట్టి రోడ్డు కావడంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా నేలంతా చిత్తడిగా మారి కనీసం పాదచారులు కూడా ఆ వైపుగా నడవలేని దుస్థితి నెలకొంది. గుంతలమయమై చాలా అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు వర్షాకాలంలో బురదమయం కావస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అటువైపుగా వెళ్లాల్సి వచ్చినప్పుడు ఒక్కోసారి కాలుజారి పడిపోయి, గాయాలపాలవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. కొండకెంగువ నుంచి 3 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి నెలకొందని, రోడ్డు బాగుచేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తమ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–రామభద్రపురం

సెప్టెంబరు 14 నుంచి గ్రామదేవత పండగలు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దసేనాపతి దాసరి పోలీసు

రాజాం సిటీ: రాజాం–సారధి గ్రామదేవత పండగలను అందరి సహకారంతో నిర్వహించనున్నామని గ్రామదేవత కమిటీ పెద్ద సేనాపతి దాసరి పోలీసు అన్నారు. స్థానిక పట్టణంలోని కుమ్మరవీధిలో అమ్మవారి గుడి వద్ద కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్న ఈ పండగలకు సంబంధించిన తేదీలను వెల్లడించారు. సెప్టెంబర్ 14న మొదటి చాటింపు వేయగా 15న భక్తులు ఉపారాలు తీయనున్నారన్నారు. అలాగే 16న రెండో చాటింపు, 17న ఉపారాలు తీస్తారన్నారు. ఘటోత్సవం సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 15 వరకు రాజాంలోని అన్ని వీధుల్లో అంగరంగ వైభవంగా జరగనుందన్నారు. మొదటి ఘటం సెప్టెంబర్ 22న, రెండోది 24న, మూడవది 29న, నాలుగవది అక్టోబర్ 1న, ఐదవది 6న, ఆరవది 8న ఘటాల ఊరేంపు జరగగా ఇవన్నీ ఆది, మంగళవారాల్లోనే చేపట్టనున్నామన్నారు. ఏడవది అక్టోబరు 10న గురువారం బంగారమ్మ తల్లి అనుపు ఘటం, 13న దుర్గమ్మతల్లి అనుపుఘటం, చివరిగా 15న బురదలపోలమ్మ అనుపుఘటంతో పండగలు పూర్తికానున్నాయని తెలిపారు. పట్టణవాసులు ఈ విషయాన్ని గమనించి, గ్రామదేవతల మొక్కులు చెల్లింపులు చేపట్టాలని కోరారు.

మాజీ సైనికులకు అండగా ఉంటాం



సీఐ సతీష్‌కుమార్‌ను కలిసిన మాజీ సైనికులు

బొబ్బిలి: మాజీ సైనికులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని సీఐ సతీష్‌కుమార్ హామీ ఇచ్చారు. స్థానిక పట్టణంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘ సభ్యులంతా సీఐని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, సంఘం తరఫున చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు, పలు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సీఐ మాట్లాడుతూ మాజీ సైనికులు కూడా యూనిఫాం లేని పోలీసులేనని, తొలుత దేశ సేవ, ఇప్పుడు సమాజ సేవకు పాటుపడుతున్న మీకు తమ నుంచి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్, ఎ.గోవిందనాయుడు, వి.ఎస్.శర్మ, ఎస్.పురుషోత్తం, పి.సురేష్‌బాబు, జి.శ్రీనివాసరావు, సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

21 మందికి ఉచితంగా ఆపరేషన్లు



రోగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైద్యులు

బొబ్బిలి: పట్టణంలోని సంఘ వీధిలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, నవజీవన స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేన్సర్, నేత్ర, దంత వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యారోగ్య సిబ్బంది నిర్ధారణ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే శస్త్రచికిత్సలు అవసరమైన 21 మందిని విశాఖపట్నంలోని కేన్సర్ ఆస్పత్రికి తీసుకువెళ్లి, ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జాషువా సాహిత్య అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు సోరు సాంబయ్య, బొద్దాన అప్పారావు, వైద్యులు వి.సుభద్ర, ఎం.సుధానంద, సుకన్య, కో–ఆర్డినేటర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు కార్మికులకు న్యాయం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు

రాజాం: పట్టణంలోని వస్త్రపురి కాలనీలో ఉన్న వాసవీ జూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు బవిరి కృష్ణమూర్తి, సీఐటీయూ సీనియర్ నాయకుడు తమ్మినేని సూర్యనారాయణ, విజయనగరం జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు పి.శంకరరావులు డిమాండ్ చేశారు. జూట్‌మిల్లు సమీపంలో కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించి, మాట్లాడిన వారు.. కార్మికులకు బకాయిపడిన పీఎఫ్, తదితర మొత్తాలను తక్షణమే ఇవ్వాలన్నారు. జీఎంఆర్ కాలంలో సుమారు 400 మంది కార్మికులు పనిచేయగా, పెన్షన్ రాక, పీఎఫ్ సెటిల్‌మెంట్ జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కలుగజేసుకుని, కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాజాం ప్రాంత నాయకులు టి.విశ్వనాథం, ఎం.త్రినాథ్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి



సోమేశ్వరరావును సత్కరిస్తున్న వాసవీ క్లబ్ రాజాం సభ్యులు

రాజాం సిటీ: వాసవీ క్లబ్ మన రాజాం–సారధి ద్వారా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని విశాఖపట్నం ప్రాంతానికి చెందిన వాసవీ క్లబ్ కార్యదర్శి కొల్లూరు సోమేశ్వరరావు అన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన క్లబ్ సభ్యుల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. నెలవారీ కార్యక్రమాల ద్వారా సేవలందించాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించాలన్నారు. విశ్రాంత సైనికులు, ఉత్తమ రైతులను గుర్తించి, గౌరవించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం చేయడం, పేదలకు ఉపయోగపడేలా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆయనను కూడా రాజాం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వాకచర్ల రాజ, గ్రంధి రవికుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రాజాం: మొక్కలు నాటుతున్న ఎంఈవో శాంతికుమారి, తదితరులు



బొబ్బిలి రూరల్: మొక్కలు నాటుతున్న యూటీఎఫ్ సభ్యులు

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సంతకవిటి ఎంఈవో బి.శాంతికుమారి, రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్‌లో కొల్లూరు జయవర్ధన్ తన పుట్టినరోజు సందర్భంగా కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు జయవర్ధన్‌ను అభినందించి, కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం కారణంగా వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని, కాలుష్యం తగ్గాలన్నా, మానవ మనుగడ కొనసాగాలన్నా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వీలైనంత వరకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్య, కొల్లి ఎరుకునాయుడు, అసిరినాయుడు, శ్రీధర్, కొల్లి అప్పారావునాయుడు, ఏగిరెడ్డి రామారావు, నీలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.విజయకుమారి, తదితరులు పలు మొక్కలు నాటి కాసేపు ప్రసంగించారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల మధ్య చదరంగం, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు పి.కస్తూరి, జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణమూర్తి, వనమిత్ర కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



వీవోఏలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏపీఎం చక్రపాణి

వంగర: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం మీసాల చక్రపాణి ఆకాంక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో లక్ పథ్ దీదీ కార్యక్రమంలో భాగంగా గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీవోఏలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా వీవోఏలు పనిచేయాలని సూచించారు. అనంతరం మహిళా సంఘాలకు మంజూరైన రుణాల చెక్కులను అందజేశారు. ఆ తర్వాత పలువురు వీవోఏలకు ప్రశంసాపత్రాలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో భగవద్గీత పారాయణం ఆదివారం చేపట్టారు. వారు మాట్లాడుతూ భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, భగవద్గీత చదివితే మనసు ప్రశాంతంగా ఉండడంతో పాటు ఉత్తమ జీవనం అలవడుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

దాతల సహకారం మరువలేనిది

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతల సహకారం మరువలేనిదని అదే గ్రామానికి చెందిన చిరువ్యాపారి వారణాసి జగన్నాథస్వామి ప్రశంసించారు. ఆదివారం నిత్యాన్నదానానికి హాజరైన 100 మందికి పైగా నిరుపేదలకు ఆయన అన్నదానం చేయడంతో పాటు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను అభినందించి, తమకు ఉన్న దానిలో కొంత సాయం చేస్తే దైవానుగ్రహం లభిస్తుందని, ప్రతిఒక్కరూ దానధర్మాలు చేసేందుకు ముందుకురావాలని కోరారు.

ఆయిల్‌మిల్లులో అగ్నిప్రమాదం



మిల్లులో ఎగసిపడుతున్న మంటలు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామ సమీపంలోని సీతారామ ఆయిల్‌మిల్లులో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఫ్యాక్టరీలో ఉన్న వేస్ట్ మెటీరియల్‌కు నిప్పంటుకోవడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ మంటలు వ్యాపించి తవుడు, సంచులకు అంటుకోవడంతో మంటలు మరింత చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా సిబ్బంది, స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని, మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు మంటలు అదుపులోకి రాగా, ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టం భారీగానే ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉందని, నష్టాన్ని అంచనా వేస్తున్నామని ఫైర్ సిబ్బంది తెలిపారు.

విలువలు తెలిపే 'కొండపొలం'



సమావేశంలో మాట్లాడుతున్న సాహితీవేత్త శ్రీనివాసరావు

రాజాం సిటీ: యదార్థ జీవిత సంఘటనలతో మానవీయ, వ్యక్తిత్వ విలువలు తెలిపే గొప్ప నవల కొండపొలం అని ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో రాజాం రచయితల వేదిక సమావేశం ఆదివారం జరగ్గా, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాసిన 'కొండపొలం' నవలను విశ్లేషిస్తూ ప్రసగించారు. ఈ నవలలో రాయలసీమకు చెందిన గొర్రెలకాపరుల జీవన విధానంతో పాటు కరువు రోజుల్లో గొర్రెలను మేపేందుకు కొండలపైకి వెళ్లి వారు అనుభవించిన బాధలను చాలా చక్కగా వర్ణించారన్నారు. ప్రధాన కథకు అనుసంధానం చేస్తూ కొన్ని పాత్రల ద్వారా మానవీయ విలువలను చొప్పించారన్నారు. యువతకు స్ఫూర్తినిచ్చే సంఘటనలు, సామాజిక, చారిత్రక వివరణలు మరెన్నో ఉన్నాయన్నారు. సమావేశంలో పొట్నూరు కోటిబాబు, రారవే నిర్వాహకులు గార రంగనాథం, రౌతు గణపతిరావునాయుడు, పెంకి దయానిధినాయుడు, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, సమతం మహేశ్వరరావు, రాజాపు శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులపై పెనుభారం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయికుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: విద్యుత్ వినియోగదారులపై పెనుభారాన్ని మోపేందుకు రంగం సిద్ధమైందని అందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని రైతు సంఘం నాయకుడు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు విమర్శించారు. స్థానిక పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో పలు ప్రజాసంఘాల ప్రతినిధులతో ఆదివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగానికి స్మార్ట్‌మీటర్లను బిగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అదే విధానాన్నే తీసుకువచ్చి, రైతుల మెడపై కత్తి పెడుతోందని దుయ్యబట్టారు. విద్యుత్ వినియోగదారులపై కూడా ధరల భారం మోపేందుకు కుయుక్తులు పన్నుతోందన్నారు. ఇప్పటికే దీనిపై ఏపీఈఆర్‌సీకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. స్మార్ట్‌మీటర్ల అమర్చడమనేది.. కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడమేనన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగిస్తే వినియోగదారులు రూ.15 వేలు ధర చెల్లించాల్సి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎస్.గోపాలం, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.